
- బాలకృష్ణకు త్వరలో సినీ పరిశ్రమ సన్మానం



*ఆగస్ట్ 30 నాటికి నటుడిగా 50ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు అగ్రనటుడు నందమూరి బాలకృష్ణ. ఈ సందర్భంగా గురువారం ఆయన్ను తెలుగు చలనచిత్రరంగ ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు అందించారు. సెప్టెంబర్ 1న సినీ,రాజకీయ చలనచిత్ర ప్రముఖుల సమక్షంలో, బాలకృష్ణకు ఘన సన్మానం నిర్వహించనున్నట్టు వారు ప్రకటించారు. నిర్మాతలు కె.ఎల్.దామోదరప్రసాద్, సునీల్‌నారంగ్, టి.ప్రసన్నకుమార్, వల్లభనేని అనిల్ తదితరులు బాలకృష్ణను కలిసిన వారిలో ఉన్నారు.*

## కీరవాణి నిజాయితీ



అవార్డు అనేది ఆ సమయంలో పోటీపడ్డ సినిమాల నాణ్యతను బట్టి ఉంటుంది తప్ప, గొప్ప తనానికి అదేం ప్రామాణికం కాదు. మహాదర్శకుడు స్వర్గీయ కె.బాలచందర్ అన్న మాట ఇది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి స్పందన ఆ మాటకు తగ్గట్టుగా ఉందని చెప్పాలి. ఆయన సంగీత దర్శకత్వం వహించిన హిందీ సినిమా 'ఔర్ మే కహా దమ్ థా' త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా జాతీయ మీడియాకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ విలేకరి ఆస్కార్ అవార్డు గురించి ప్రస్తావిస్తూ.. 'ప్రపంచవ్యాప్త గుర్తింపు ఆలస్యంగా దక్కిందని భావిస్తున్నారా? అని ప్రశ్నించగా, కీరవాణి స్పందించారు. 'గుర్తింపు రావాలని రాసుంటే ఎక్కడినుంచైనా, ఎలాగైనా వచ్చేస్తుంది. అది త్వరగా వచ్చిందా, ఆలస్యంగా వచ్చిందా.. అనే విషయాన్ని పక్కనపెడితే.. నేను అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వని పాటకు గొప్ప గుర్తింపు వచ్చింది. అందుకే ఆస్కార్ తీసుకున్నా పెద్ద ఎగ్జైట్‌మెంట్ ఫీలవ్వలేదు' అని తన మనసుని ఆవిష్కరించారు కీరవాణి. నిజానిక్కూడా 'నాటు నాటు' పాటకంటే ఎన్నో గొప్ప పాటలు ఆయన నుంచి వచ్చాయి. కేవలం కీరవాణి పాటల వల్లే ఆడిన సినిమాలు కూడా చాలా ఉన్నాయి. నిజాన్ని నిర్మొహమాటంగా ఆవిష్కరించిన ఈ సంగీత సరస్వతిపై ప్రశంసల జల్లు కురుస్తున్నది.

## ఆలుమగల అగచాట్లు



'నాకు సందేశాలివ్వడం ఇష్టం ఉండదు. ఎంటర్‌టైన్ చేయడమే ఇష్టం. సామాజిక బాధ్యతతో కూడిన వినోదభరిత చిత్రాలను చేయడానికే ఎక్కువ ఇష్టపడతాను. 'డార్లింగ్' సినిమా ఆ కోవకు చెందినదే' అంటున్నారు దర్శకుడు అశ్విన్‌రామ్. ఆయన దర్శకత్వంలో ప్రియదర్శి, నభానటేశ్ జంటగా రూపొందిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరి' ఉపశీర్షిక. కె.నిరంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మాతలు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అశ్విన్‌రామ్ విలేకరులతో ముచ్చటిచారు. 'ఇందులో కథానాయికకు స్ప్లిట్ పర్సనాలిటీ అనగానే 'అపరిచితుడు'తో పోల్చి మాట్లాడుతున్నారు. నిజానికి ఈ రెండిటికీ అసలు పొంతనే లేదు. 'అపరిచితుడు'లో సామాజిక సమస్యల్నీ టార్గెట్ చేస్తే, 'డార్లింగ్'లో ఇంటి ఇష్యూస్‌ని డీల్ చేశాం. అలాగే 'డార్లింగ్' అనే టైటిల్ గురించి కూడా చర్చ నడుస్తున్నది. ఈ కథకు 'డార్లింగ్' టైటిల్ పర్‌ఫెక్ట్‌గా యాప్ట్. భార్యభర్తలు ప్రేమగా పిలుచుకునే పదం 'డార్లింగ్'. ప్రభాస్ ఫ్యాన్స్ కూడా ఈ టైటిల్ విషయంలో పాజిటివ్‌గా స్పందిస్తున్నారు.' అని తెలిపారు అశ్విన్‌రామ్. ఈ సినిమాను పర్సనాలిటీ డిజార్డర్‌తో డీల్ చేశామని, అది సెన్సిటివ్ డిజార్డర్ అని అందుకే ఈ సినిమాకు యూ/ఏ ఇచ్చారని ఆయన అన్నారు. సెన్సార్‌వారు ఒక్క కట్ కూడా చెప్పలేదని, పెద్దల సమక్షంలో పిలల్లు కూడా చూడాల్సిన సినిమా ఇదని అశ్విన్‌రామ్ తెలిపారు. అట్లీ 'రాజారాణి' సినిమాకి సహాయకునిగా పనిచేసి చాలా నేర్చుకున్నానని, 'డార్లింగ్'లో భార్యభర్తల విభిన్న దృక్పథాన్ని ఆవిష్కరించామని ఆయన అన్నారు. నభా నటేశ్, ప్రియదర్శి సినిమా కోసం చాలా ఎఫర్ట్ పెట్టారని, అలాగే అనన్య నాగళ్ల ఇందులో ప్రత్యేకమైన పాత్ర పోషించారని, సినిమా బాగా రావడానికి ప్రధాన కారణం నిర్మాతలేనని, సాంకేతికంగా కూడా సినిమా అద్భుతంగా ఉంటుందని అశ్విన్‌రామ్ చెప్పారు.

## ధనుష్‌తో ప్రేమ కథ



'యానిమల్' చిత్రంతో బాలీవుడ్ నాయిక త్రిప్తి ద్రిమి జాతకం ఒక్కసారిగా మారిపోయింది. ఆ సినిమా తర్వాత ఈ భామ డేట్స్ కోసం బాలీవుడ్ అగ్ర దర్శకనిర్మాతలు పోటీ పడ్డారు. ప్రస్తుతం త్రిప్తి చేతిలో అరడజనుకుపైగా భారీ చిత్రాలున్నాయి. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకుంది. ధనుష్ నటిస్తున్న 'తేరే ఇష్క్ మే' చిత్రంలో కథానాయికగా త్రిప్తి పేరును ఖరారు చేశారు. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ధనుష్-ఆనంద్ ఎల్ రాయ్ కాంబినేషన్‌లో వచ్చిన 'రాన్‌జనా' విషాద ప్రేమ కథగా ప్రేక్షకుల్ని మెప్పించింది. దాదాపు పదేళ్ల విరామం తర్వాత వీరిద్దరు కలిసి పనిచేస్తుండటంతో 'తేరే ఇష్క్ మే' చిత్రంపై ఇప్పటికే అంచనాలు ఏర్పడ్డాయి. 'రాన్‌జనా' తరహాలోనే వారణాసి నేపథ్య కథాంశంతో 'తేరే ఇష్క్ మే' చిత్రం తెరకెక్కనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో ధనుష్ ప్రేమికురాలిగా త్రిప్తి ద్రిమి కనిపించనుంది. అక్టోబర్‌లో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. త్రిప్తి ద్రిమి నటించిన తాజా చిత్రం 'బ్యాడ్‌న్యూస్' ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

## భర్త.. భార్య.. ప్రియురాలు



వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్1, ఎఫ్2 చిత్రాలు భారీ విజయాలను నమోదు చేసుకున్నాయి. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి వీరిద్దరి కలయికలో సినిమా రానుంది. దిల్ రాజు, శిరీష్ నిర్మాతలు. ఇది ప్రతిష్టాత్మక శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రూపొందుతోన్న 58వ సినిమాకావడం విశేషం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ 'సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో మొదలైంది. ప్యాలెస్‌లో జరుగుతున్న షూటింగ్‌లో మెయిన్ కాస్ట్ పాల్గొంటున్నారు. హీరో, అతని గర్ల్‌ఫ్రెండ్, అనతి ఎక్స్‌లెంట్ వైఫ్.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇది. ఇందులో వెంకటేశ్ జోడీగా మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ నటిస్తున్నారు. రీసెంట్‌గా విడుదల చేసిన మేకింగ్ వీడియో వర్కింగ్ ఎట్మాస్ఫియర్‌ని చూపించింది. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న సినిమా ఇది' అని తెలిపారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్ నరేశ్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



*కథానాయిక వరలక్ష్మి శరత్‌కుమార్ తన చిరకాల మిత్రుడు, గ్యాలరిస్ట్ నికోలస్ సచ్‌దేవ్‌తో కలిసి వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. గురువారం ఈ జంట వివాహం థాయ్‌లాండ్‌లోని క్రాబీ బీచ్ రిసార్ట్‌లో ఘనంగా జరిగింది. పూర్తి దక్షిణాది సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ పెళ్లి వేడుకకు ఇరు కుటుంబ సభ్యులతో పాటు సన్నిహితులు హాజరయ్యారు.*

## భవితను మార్చిన వ్యక్తి



విజయ్ ఆంటోని నటిస్తున్న పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకుడు. కమల్ బోరా, డి.లలిత, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మాతలు. ఆగస్ట్ 2న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. తనను చిన్నచూపు చూసే సమాజం భవితను మార్చిన ఓవ్యక్తి కథ ఇదని, ఓ దీవి నేపథ్యంలో సాగే ఈ సినిమాను అండమాన్, డయ్యాడమన్‌లలో చిత్రీకరించామని, ఇప్పటివరకూ విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తున్నందుకు ఆనందంగా ఉందని, సినిమా కూడా తప్పకుండా పెద్ద విజయం సాధిస్తుందని మేకర్స్ తెలిపారు. మేఘా ఆకాష్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మురళీశర్మ, పృథ్వీ అంబర్, శరణ్య పొన్వన్నన్, తైవాసల్ తదితరులు ఇతర పాత్రధారులు. అచ్చుమణితో కలిసి విజయ్ ఆంటోని సంగీతం అందించిన ఈ చిత్రానికి నిర్మాణం: ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్.

## ప్రతి ఇంటి కథ

రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడు. సాయిజా క్రియేషన్స్ పతాకంపై ఉమాదేవి, శరత్‌చంద్ర నిర్మించారు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల నవీన్‌చంద్ర ముఖ్య అతిథిగా ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో జరిగే కథ ఇదని, తల్లిదండ్రులు, పిల్లలకు మధ్య ఉండే అనుబంధాలను ఆవిష్కరిస్తుందని చెప్పారు. సమానత్వం అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు పద్మారావు అబ్బిశెట్టి తెలిపారు. హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో పాటు చక్కటి సందేశంతో ఈ చిత్రం ఆకట్టుకుంటుందని నిర్మాత శరత్‌చంద్ర చల్లపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## ఇది నాన్న నుంచి నేర్చుకున్న పాఠం



దీపిక పదుకొణే ప్రస్తుతం ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నది. తనెంత హ్యాపీగా ఉన్నదో తెలియజేయడానికి, తానున్న ప్రదేశానికి సంబంధించిన ప్రకృతి చిత్రాలను ఫొటోలుగా తీసి, సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటున్నది దీపిక. అందమైన ఆకాశం, నందనవనాన్ని తలపించే రంగురంగుల పూల మొక్కలు, గంభీరమైన సముద్రం.. ఇవన్నీ దీపిక ఫొటోలలో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఆమె గర్భవతి అన్న విషయం తెలిసిందే. కాన్పుకు చేరువవుతున్న నేపథ్యంలో పుట్టబోయే పాపాయికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నది దీపిక. ప్రకృతి ఒడిలో ఎక్కువ సమయం గడపడం.. అవసరం మేర చిన్న చిన్న ఎక్స్‌ర్‌సైజ్‌లు చేస్తూ తన జీవన విధానం గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. 'ఓ కొత్త ప్రపంచంలోకి వెళ్లిపోయాను. ఇది నా బిజీ లైఫ్‌కు భిన్నమైన ప్రపంచం. ఇక్కడ మనసంతా ప్రశాంతంగా ఉంటుంది. మనసులోకి చెడు ఆలోచనలు రావు. ఎటు చూసినా ఆహ్లాదం.. చుట్టూ కావాల్సినంత స్వేచ్ఛ. ఈ ఆనందానికి కారణం నా మనసే. మన మనసు మన కంట్రోల్‌లో ఉంటే బాధలకు తావుండదు. ఇది మా నాన్న నుంచి నేర్చుకున్న పాఠం' అంటూ చెప్పుకొచ్చింది దీపిక.

## మైకేల్ జాక్సన్‌తో పాట మిస్ అయ్యింది!

ప్రపంచవ్యాప్త సంగీత ప్రియులు ఎంతగానో ఆరాధించే పాప్ రారాజు మైకేల్ జాక్సన్ ఓ భారతీయ సినిమాలో ఆడిపాడితే ఎలా ఉండేది? ఆ ఊహే అద్భుతం కదా? అందుకోసం ప్రయత్నాలు కూడా జరిగాయి. అయితే మైకేల్ జాక్సన్ అకాల మరణంతో ఆ కల సాకారం కాలేకపోయింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ ఆ ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ''స్లమ్‌డాగ్ మిలియనీర్' చిత్రానికి ఆస్కార్ గెలుచుకున్న అనంతరం లాస్ ఏంజిలస్‌లో మైకేల్ జాక్సన్‌ను కలిశా. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' మ్యూజిక్ తనకెంతో నచ్చిందని నాతో చెప్పారు. తన పిల్లలను కూడా నాకు పరిచయం చేశారు. ఇండియాకు వచ్చిన తర్వాత మైకేల్ జాక్సన్‌ను కలిసిన విషయాన్ని దర్శకుడు శంకర్‌తో పంచుకున్నా. అప్పుడు ఆయన 'ఎంథిరన్' షూటింగ్‌లో ఉన్నారు. 'మైకేల్ జాక్సన్‌తో మన సినిమాలో ఓ పాట పాడిస్తే ఎలా ఉంటుందో ఆలోచించు. అది సాధ్యమయ్యే పనేనా?' అంటూ శంకర్ నాతో అన్నారు. ఆ మరుసటి రోజే నేను మైకేల్ జాక్సన్‌తో ఫోన్‌లో ఈ విషయాన్ని చెప్పాను. 'మీరు ఏం చెప్పినా నేను చేయడానికి సిద్ధం. మనిద్దరం కలిసి వర్క్ చేద్దాం' అన్నారు. ఇది జరిగిన కొన్ని నెలలకే మైకేల్ జాక్సన్ మరణించారు. దాంతో మేమిద్దరం చేయాల్సిన తమిళ సాంగ్ ఆగిపోయింది' అని ఏఆర్ రెహమాన్ చెప్పారు.





## 'రా' అధిపతి పాత్రలో అనిల్ కపూర్

'యానిమల్' చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్‌లో మంచి బ్రేక్ సంపాదించుకున్నారు సీనియర్ నటుడు అనిల్ కపూర్. తండ్రి పాత్రలో ఆయన కనబరచిన నటనకు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఈ నేపథ్యంలో అనిల్ కపూర్ వరుసగా భారీ చిత్రాలకు సైన్ చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం యష్ రాజ్ ఫిల్మ్స్ (వైఆర్‌ఎఫ్) స్పై యూనివర్స్‌లో భాగంగా నిర్మిస్తున్న మూడు చిత్రాల్లో అనిల్ కపూర్ నటించబోతున్నారు. యష్‌రాజ్ ఫిల్మ్స్ ప్రస్తుతం 'వార్-2' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కథానాయకులు. ఈ చిత్రంలో అనిల్‌కపూర్ కీలక పాత్రను పోషించబోతున్నారు. ఇక అలియాభట్ గూఢచారి పాత్రలో నటిస్తున్న 'ఆల్ఫా', షారుఖ్‌ఖాన్ 'పఠాన్-2'లో చిత్రాల్లో కూడా అనిల్‌కపూర్ ముఖ్య పాత్రల్ని పోషించబోతున్నారు. ఈ మూడు చిత్రాల్లో ఆయన భారత గూఢచారి సంస్థ 'రా' అధిపతి పాత్రలో నటించబోతున్నారని సమాచారం.

